కేలెండర్ ఆవిష్కరణ

నిజాంపేట్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) 2024 నూతన సంవత్సర కేలెండర్‌ను శనివారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా దళితుల సమగ్రాభివృద్ధికి తమ సంస్థ కృషి చేస్తోందని, కులాంతర వివాహాల ప్రోత్సాహంతో పాటు దళితులకు ఉచిత విద్యుత్, 2 ఎకరాల స్మశాన వాటికల సాధనను పోరాడి సాధించామన్నారు.

మేం ఇక్కడే ఉంటాం

పోలీసులతో ట్రాన్స్‌జెండర్ల వాగ్వాదం



పోలీసులతో గొడవ పడుతున్న ట్రాన్స్‌జెండర్లు

సుభాష్‌నగర్: మేము ఇక్కడే ఇల్లు కట్టుకొని ఉంటాం.. ఎవరు ఏం చేస్తారో చూస్తాం అంటూ ట్రాన్స్‌జెండర్లు పోలీసుల ముందే సవాల్ విసిరారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో స్టేట్ ఫైన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఎస్ఎఫ్‌సి అధికారులు జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు అక్కడికి చేరుకొని పనులు నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో అక్కడ ఉన్న హిజ్రాలు పోలీసులను నానా దుర్భాషలాడుతూ హల్‌చల్ చేశారు. దీంతో చేసేదేమీ లేక పోలీసులు వెనుతిరిగారు.

యాదాద్రికి పాదయాత్ర



సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద భారీ మెజార్టీతో గెలిచి రాష్ట్రంలోనే తిరుగులేని నాయకుడిగా నిలిచాడని బాలయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేష్ అన్నారు. మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించడంతో శనివారం బాలయ్యనగర్ నుండి 35 మందితో కలిసి మొక్కులు చెల్లించేందుకు ఆయన యాదగిరిగుట్టకు పాదయాత్రగా తరలి వెళ్లారు.

గౌడసంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు

ఆల్విన్‌కాలనీ: గౌడసంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం 10వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివేకానందనగర్‌లోని చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి కౌండిన్య సేవా సమితి నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. గౌడ సంఘ సోదర, సోదరీమణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు.

కార్తీకవన సమారాధన

మోతీనగర్: బ్రాహ్మణ అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన బ్రాహ్మణ చైతన్య సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మోతీనగర్‌లోని శృంగేరి శారదపీఠంలో ఈ కార్తీక వన సమారాధన ఉంటుందని తెలిపారు. హరిహరులకు ప్రీతిపాత్రమైన ఈ పవిత్ర మాసంలో కార్తీక వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'ఫ్రీ' షురూ..

ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల హర్షం



జీడిమెట్ల: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం నిమిత్తం నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే మహిళలు, కళాశాలలకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవడానికి స్త్రీలు, యువతులు, బాలికలు తాము సిద్ధం అంటున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క మహిళకు ఉచిత ప్రయాణం అందించడం అనందించదగ్గ విషయమని మహిళలు అంటున్నారు.

జీడిమెట్ల డిపోలో 113 బస్సులు, రోజుకు 15లక్షల ఆదాయం..

జీడిమెట్ల డిపోలో మొత్తం 113 బస్సులు ఉన్నాయి. వాటిలో 50మెట్రో, సిటీ అర్డినరీ, 2సూపర్ లక్జరీ బస్సులు ఉన్నాయి. వీటిలో మెట్రో, సిటీ అర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచితంగానే ప్రయాణం అని డీఎం విజయ్‌కుమార్ తెలిపారు. ప్రతినిత్యం జీడిమెట్ల డిపోలో 15లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. దీనిలో 50 శాతం మెయింటెనెన్స్ పోగా సగం మిగులుగా ఉండేది. ఇప్పుడు మహిళల ఉచిత బస్సు ప్రయాణం వలన సగం ఆదాయం తగ్గనుంది. బస్సులో ప్రయాణం చేసే ప్రతి మహిళ తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు కార్డు తమతో పాటు తెచ్చుకోవాలని డీఎం తెలిపారు.

జీడిమెట్ల డిపో నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులు..

జీడిమెట్ల డిపో నుండి ప్రతినిత్యం బస్సులు సికింద్రాబాద్, సీబీఎస్, చార్మినార్, మెహిదీపట్నం, హైటెక్‌సిటీ, కోఠి, పటాన్‌చెరు, కుషాయిగూడ, ఉప్పల్‌కు బస్సు షెడ్యూల్స్ ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న షెడ్యూల్స్‌లో తగ్గించే ప్రశక్తి లేదని అన్నారు. ఇంతకు ముందు ఉన్న అర్డినరీ బస్సుపాసు రూ.1150, రూ.1300 వందల మెట్రోపాసు ఇక మిదట మహిళలు తీసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

బస్సు సర్వీసుల్లో ఎటువంటి మార్పుల్లేవు



ప్రస్తుతం జీడిమెట్ల డిపో నుండి 113 బస్సు షెడ్యూల్స్ ఉన్నాయి. షెడ్యూల్స్‌లో ఎలాంటి మార్పులు లేకుండా నడపాలని ప్రభుత్వం మాకు ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేసింది. నగరంలోని అర్డీనరీ, మెట్రో బస్సుల్లో ప్రయాణించే ప్రతి మహిళలకు వయస్సుతో సంబంధం లేకుండా ఉచితం. ఆదాయం తగ్గినప్పటికి సర్వీసులో మాత్రం ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

– పి.విజయ్‌కుమార్, డీఎం జీడిమెట్ల డిపో

నాకు ఇక పాస్ అవసరం లేదు



నేను ప్రతినిత్యం ఉద్యోగం నిమిత్తం షాపూర్‌నగర్ నుండి గండిమైసమ్మకు వెళ్లాను. ప్రస్తుతం నేను తీసుకున్న బస్సుపాసు ప్రతినెల రూ.1300 చెల్లిస్తాను. ఇక నుండి నేను పాస్ తీసుకోవాల్సిన అవసరం లేదు ఉచితంగా తెలంగాణాలో ఎక్కడికైనా ఉచితంగా వెళ్లవచ్చు. మహిళల కోసం ఈ పథకాన్ని తీసుకువచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు..

– జయ, ప్రైవేట్ ఉద్యోగిణి షాపూర్‌నగర్

రూ.2వేల వరకు ఆదా చేసుకోవచ్చు



నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే మహిళలకు రూ.2వేల వరకు డబ్బు పొదుపు చేసుకోవచ్చు. ప్రభుత్వం మహిళలకోసం తీసుకొచ్చిన ఈ పథకాన్ని మేము స్వాగతిస్తున్నాం. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకోసం ప్రవేశపెట్టిన పథకాల్లో మొదటి పథకం బాగుంది.

– పద్మలతారెడ్డి, సుభాష్‌నగర్.

ఉచిత ప్రయాణంతో ఎంతోమేలు

జీడిమెట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల కోసం తీసుకువచ్చిన ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమం మహిళలకు ఎంతో మేలుచేస్తుందని షాపూర్‌నగర్ పీహెచ్‌సీ డాక్టర్ నవనీత అన్నారు. శనివారం జీడిమెట్ల డిపో వద్ద మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె డీఎం విజయ్‌కుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంబించారు.



బస్సులో ఎక్కి కూర్చున్న డా.నవనీత..

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుండిగల్: వృద్ధాప్యంలో ఉన్న వారికి సహాయం చేయడం మన బాధ్యత అని విప్లవజ్యోతి అల్లూరి పౌండేషన్ జనరల్ సెక్రటరీ చింతకింది నాగరాజు అన్నారు. శనివారం పౌండేషన్ సభ్యులు దుండిగల్‌లోని పల్లవి అనాథాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అదే విధంగా షాపూర్‌నగర్ ఉషోదయ కాలనీకి చెందిన ముండ్ల వెంకటరమణ వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పౌండేషన్ అధ్యక్షులు గొట్టిముక్కల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జంగా తాతాజీ, అర్గనైజింగ్ సెక్రటరీ అప్పాని నరసింహ, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే పరిశోధనలను ప్రోత్సహించాలి



నమూనాలను తిలకిస్తున్న తల్లిదండ్రులు

దుండిగల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పరిశోధనలు చేసే విధంగా ప్రోత్సహించాలని గీతాంజలి స్కూల్ చైర్మన్ పి.శ్రీనివాస్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని గీతాంజలి స్కూల్‌లో శనివారం లెర్నర్స్ సినాప్‌సిస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పలు నమోనాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మోడళ్లను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, సిఎఫ్ఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే, స్కేటింగ్‌లో శిక్షణ



కుత్బుల్లాపూర్: జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించి మెడల్స్ తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బూమ్స్ అకాడమీ నిర్వాహకుడు కృష్ణ అన్నారు. జనవరి 7వ తేదీన బెంగళూరు వేదికగా నేషనల్ లెవెల్‌లో జరగనున్న కరాటే పోటీలకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నుండి పలువురు క్రీడాకారులను ఎంపిక చేసి వారికి తమదైన శైలిలో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే స్కేటింగ్, కరాటే లో రాణిస్తూ వస్తున్న క్రీడాకారులను పలు అంతర్జాతీయ వేదికల్లో జరిగిన పోటీలకు తీసుకువెళ్లి అక్కడ పలు ఈవెంట్స్‌లో మెడల్స్ దక్కించుకున్నారు. అండర్-4 నుండి మొదలుకొని విద్యార్థులను వివిధ కేటగిరీల వారీగా జరిగే పోటీలకు రెడీ చేస్తున్నారు. శనివారం గాజులరామారం అకాడమీలో జరిగిన ప్రత్యేక శిక్షణలో సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొని కరాటేలో విన్యాసాలు చేశారు.

ఎమ్మెల్యే గాంధీకి అభినందనలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పీవీఆర్ సాయిహిల్స్ కాలనీవాసులు

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీవీఆర్ సాయి హిల్స్ కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. శేరిలింగంపల్లి ప్రజానీకానికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని, వెన్నంటి నడిపించిన కేసీఆర్, కేటీఆర్‌లకు రుణపడి ఉంటానన్నారు. మరింత బాధ్యతగా శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం





వేడుకలను ప్రారంభిస్తున్న కెన్నడీ గ్లోబెల్ స్కూల్ చైర్మన్ జమలారెడ్డి..

నిజాంపేట్: బాచుపల్లిలోని కెన్నడీ గ్లోబల్ స్కూల్ 19వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్కూల్ చైర్మన్ ఎస్.జమలారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.సుబ్బారెడ్డి, డైరెక్టర్ సుధాకర్‌రావు, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మిభట్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన, వసుదైక కుటుంబం అనే భావనతో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అనంతరం చైర్మన్ జమలారెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత, కుటుంబ ప్రయోజనాల కంటే సామూహిక శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే ఆలోచనా దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి కృషి చేస్తున్నామని, సమస్యలను చూసి భయకుండా వాటిని పరిష్కరించేలా తర్ఫీదు నిస్తున్నామన్నారు.

ఈనెల 11న 'నిధి ఆప్‌కే నిఖత్'..

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో 'నిధి ఆప్‌కే నిఖత్' నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 11న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని బస్ టెర్మినల్ రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవటమే కాకుండా సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్ఇఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చన్నారు.

కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆరోగ్యగా ఉండాలని కోరుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి కూకట్‌పల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన కేసీఆర్, తెలంగాణ రాష్టాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడంతో చాలా కృషి చేశారని అలాంటి నాయకుడు కేసీఆర్‌కు అనుకోకుండా కాలువిరగడం బాధాకరమైన విషయమన్నారు. ఆయన రాష్ట్ర ప్రజలందరి ఆశీర్వాదంతో త్వరగా కోలుకోవాలని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. తులసిరావు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులున్నారు.



స్వరాష్ట్రంలో మూడోసారి నూతన ప్రభుత్వం !

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: స్వరాష్ట్రంలో మూడోసారి నూతన ప్రభుత్వం ఏర్పడుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బీఆర్ఎస్ భవన్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా అసెంబ్లీకి చేరుకుని ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లుగా దేశంలో అగ్రగామిగా నిలిపిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తనపై విశ్వాసం ఉంచిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.

ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు



అనాథాశ్రమంలో చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి



నిజాంపేటలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తున్న కార్యకర్తలు..

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 79వ జన్మదిన వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పలు ప్రధాన కూడళ్ల వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తెలంగాణ తల్లిగా సోనియాగాంధీని పలువురు అభివర్ణించారు.

- కుత్బుల్లాపూర్



వెన్నెలగడ్డలో నినాదాలు చేస్తున్న ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్



చింతల్‌లో కేక్ కట్ చేస్తున్న కార్మిక నేత చింతల నాగరాజు

మహిళ అదృశ్యం

పోచారం: మహిళ అదృశ్యమైన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మాయిల్‌ఖాన్ గూడకు చెందిన రాధికకు రెండేళ్ల క్రితం సుధాకర్‌తో వివాహం జరిగింది. ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో శనివారం ఆమె తండ్రి పిట్టల యాకయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్థాపంతో ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బండారి శ్రీను(32)కు 16 ఏళ్ల క్రితం వివాహమైంది. 15 రోజుల క్రితం అతడి భార్య చెప్పకుండా తల్లిగారింటికి వెళ్లిపోయి తిరిగి రావడం లేదు. దీంతో మనస్థాపంతో మద్యానికి బానిసయ్యాడు. ఐదు రోజులుగా ఇంటికి వెళ్లడం లేదు. ఘట్‌కేసర్ రైల్వేక్వార్టర్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని స్థానికులు శుక్రవారం మధ్యాహ్నం సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా అనంతరం ఘట్‌కేసర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్తీక శోభ







కీసర: మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి(ఎంబీబీఎస్) ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని శనివారం మండలంలోని భోగారం గ్రామంలోని నిమ్మకాయల గూడెం వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు దోర్బల కృష్ణమూర్తిశర్మ, ప్రధానకార్యదర్శి గణపురం రాంప్రసాద్‌శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ప్రత్యేక పూజలతో పాటు కుటుంబసమేతంగా వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 100 కుటుంబాలు కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు.

చీర్యాలలో సత్యనారాయణ స్వామి వ్రతాలు

చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సత్యనారాయణ వ్రతాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. శనివారం ఉదయం నుంచే స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున చీర్యాల ఆలయానికి తరలివచ్చారు. సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొని, సప్త వృక్షాల వద్ద కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.